# మహాచండీ దేవిగా దుర్గమ్మ



2 లో


# మనం



## కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు



గురువారం | 15 | అక్టోబర్ | 2026 | పేజీలు: 11


# ఇంద్రకిలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్లను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము







పి.మీరాహుస్సేన్ ఖాన్

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సందర్శించి, శ్రీ మహా చండీదేవి అలంకృత కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్రపతిగా విజయవాడకు విచ్చేసిన ఆమెకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతి భక్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు సైతం అభివాదం చేస్తూ ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ అర్చక స్వాములు, వేద పండితులు సంప్రదాయ ఆలయ మర్యాదలతో రాష్ట్రపతికి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అంతరాలయంలోకి వెళ్లి శ్రీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాష్ట్రపతి సుమారు 8 నిమిషాల పాటు అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

-విజయవాడ, మనంబ్యూరో చీఫ్



క్యూలైన్లలో భక్తులకు అభివాదం



అర్చకుల ఆశీర్వాదాలు



ప్రసాద స్వీకరణ



మల్లేశ్వర స్వామివారి దర్శనం



భక్తులకు అభివాదం

7 లో



5

## అర్హులైన ఉపాధ్యాయులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి

ఎలక్టోరల్ రోల్స్ రూపకల్పనలో ఎలాంటి ఫిర్యాదులకు తావివ్వొద్దు

ఆరు జిల్లాల అధికారులతో సమీక్షించిన డి ఆర్ ఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి



10 లో

## మహాచండీ అలంకారణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి



## ఇంద్రకీలాద్రిపై భక్తులకు ఊరట!

సాంకేతికతతో సులభ దర్శనం..

భారీగా తరలివస్తున్న భక్తులు..

గంటలోపే అమ్మవారి దర్శనం

పోలీసు పర్యవేక్షణతో భక్తుల భద్రత

2 లో

## శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులు వేగవంతంగా నిర్వహించాలి



**నగర కమిషనర్**

**గుంటూరు నగరపాలక సంస్థ అక్టోబర్ :14 (మనం న్యూస్ ప్రతినిధి)** శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులను వేగంగా చేపట్టడానికి ఆర్‌బి అధికారులు, కాంట్రాక్టర్,జీఎంసి అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి, రెవెన్యూ, ఆర్‌అబి,జీఎంసి అధికారులతో సంయుక్త సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,ఆర్‌ఓబి పనుల వేగవంతం కోసం ప్రకటించిన భూ సేకరణ ప్రక్రియని త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.భూ సేకరణలో రెవెన్యూ అధికారులకు జీఎంసి నుండి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కోర్ట్ కేసుల వారీగా సమీక్షించి,తగిన వివరాలతో ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు.కాంట్రాక్టర్ ప్రతినిధులతో మాట్లాడుతూ, పనులను రోజువారీ లక్ష్యానికి అనుగుణంగా చేపట్టాలని, అందుకు తగిన సంఖ్యలో కార్మికులను,ఇతర యంత్ర సామాగ్రిని సిద్దం చేసుకోవాలన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ పోలీస్ వారితో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు,సిటి ప్లానర్ డి.రాంబాబు,ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, ఆర్‌బి డిఈఈ రాజేంద్రనాయుడు, పశ్చిమ తహశీల్దార్ కిరణ్ కుమార్,ఆర్‌ఓబీ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ మన ప్రభుత్వ పిల్లలే విజేతలు

**పొంగూరు షరిణి**

**నెల్లూరు: అక్టోబర్ 14 (మనం న్యూస్):** రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విశేష కృషితో, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దే బృహత్తర లక్ష్యంతో ముందుకు సాగుతున్న తరుణంలో... వారి కుమార్తె షరిణి పొంగూరు స్వయంగా రంగంలోకి దిగి ప్రభుత్వ బడుల రూపురేఖలను సమూలంగా మారుస్తూ విద్యార్థులకు కొండంత భరోసానిస్తున్నారు. ఈ అభివృద్ధి బాటలో స్థానిక ఎంఎస్ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ను సందర్శించిన షరిణి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు విద్యాశాఖ తరపున అందిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఇన్ స్పోర్ట్స్ అవార్డును 2025-26 సంవత్సరానికి గాను ఎంఎస్ఎం పాఠశాల కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఇక్కడ కనీసం 20 మంది విద్యార్థులు నేషనల్ స్పోర్ట్స్కు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, హ్యాండ్ బాల్, సాఫ్ట్‌బాల్, కో-కో, ఆటియా-పాటియా వంటి క్రీడల్లో బాలురు మూడవ స్థానం, బాలికలు రెండవ స్థానం సాధించడమే కాకుండా, లక్నో,



జమ్ము అండ్ కశ్మీర్, చండీగఢ్ ప్రాంతాలలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆరుగురు విద్యార్థులు ఎంపికై పాఠశాల ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయడం పట్ల క్రీడాకారులను అభినందించారు. కేవలం చదువు మాత్రమే కాకుండా క్రీడలకు కూడా సమ ప్రాధాన్యత ఇస్తేనే విద్యార్థులు పరిపూర్ణంగా ఎదుగుతారని గట్టిగా నమ్ముతూ, విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. అంతేకాకుండా, పాఠశాలలో ఈపీటీఎం ఫ్లోరింగ్ మరియు పీపీ టైల్స్తో కూడిన అద్భుతమైన ఇంటర్నేషనల్ స్టాండర్డ్ స్పోర్ట్స్ గ్రౌండ్ ను కేవలం నెల రోజుల్లోగా రెనోవేట్ చేసి అందిస్తామని ఘంటాపథంగా హామీ ఇవ్వడమే కాకుండా, నేషనల్స్కు ఎంపికైన క్రీడాకారులకు అవసరమైన స్పోర్ట్స్ ఎక్విప్మెంట్, షూస్ మరియు ఇతర అన్ని వసతులను తాను వ్యక్తిగతంగా సమకూరుస్తానని భరోసానిచ్చారు. మంత్రి నారాయణ ఆశయాలకు రూపమిస్తూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండగా నిలుస్తున్న షరిణి గారి చొరవపై విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మురళీకృష్ణ మరియు ఫిజికల్ డైరెక్టర్ పి. అజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇంద్రకీలాద్రిపై భక్తులకు ఊరట!

- సాంకేతికతతో సులభ దర్శనం..
- భారీగా తరలివస్తున్న భక్తులు..
- గంటలోపే అమ్మవారి దర్శనం

**విజయవాడ,అక్టోబర్, 14(మనం న్యూస్):** శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై భక్తుల సందడి నెలకొంది. శ్రీ మహాచండీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సమన్వయంతో కూడిన నిర్వహణతో గంటలోపే అమ్మవారి దర్శనం పూర్తవుతోందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీ.కె. శీనా నాయక్, దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా గాంధీ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర నేతృత్వంలోని సంబంధిత విభాగాలు ఉత్సవాల నిర్వహణలో సమన్వయంతో పనిచేస్తున్నాయి. దర్శన క్యూలైన్ల నిర్వహణ, భక్తుల రాకపోకల క్రమబద్ధీకరణ, రద్దీ పర్యవేక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా ఉపయోగపడుతోంది. సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట్ల సిబ్బందిని అప్రమత్తం చేయడం ద్వారా దర్శన ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు చేపడుతున్నారు. సాంకేతిక నిఘాతో పాటు క్షేత్రస్థాయి పోలీసు పర్యవేక్షణ భక్తుల భద్రతకు తోడ్పడుతోంది.భక్తులకు తాగునీరు, వైద్య సహాయం, అన్నప్రసాదం వంటి సౌకర్యాలు అందించడంపై సంబంధిత విభాగాలు దృష్టి సారిస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులతో వచ్చే కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా సిబ్బంది సూచనలు పాటిస్తూ క్యూలైన్లలో క్రమశిక్షణతో ముందుకు సాగాలని అధికారులు సూచిస్తున్నారు.దసరా ఉత్సవాల నిర్వహణలో దేవస్థానం, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ, ఇతర సంబంధిత విభాగాల మధ్య సమన్వయం ప్రాధాన్యం సంతరించుకుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.



## మహాచండీ దేవిగా దుర్గమ్మ

- శరన్నవరాత్రుల్లో కొన్నేళ్లుగా ఈ అలంకరణ ప్రత్యేకం
- మెరుపు మెరిస్తే ఎంత వెలుగుగా ఉంటుందో అంతటి తేజోమయమైన రూపంతో దుర్గమ్మ సాక్షాత్కారం

**ఇంద్రకీలాద్రి,అక్టోబర్,14,(మనం ప్రతినిధి):** దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా 4వ రోజైన బుధవారం ఆశ్వయుజ శుద్ధ చవితినాడు



ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ మహాచండీ దేవిగా దర్శనమిస్తుంది. ఈ ఏడాది కూడా శరన్నవరాత్రుల్లో చండీదేవి అలంకరణ ప్రత్యేకం. జగజ్జననీ అయిన దుర్గామాత ఈ రోజున ఒక మెరుపు మెరిస్తే ఎంత వెలుగుగా ఉంటుందో అంతటి తేజోమయమైన రూపంతో అవ ్మవారు సింహం భుజములపై భీషణంగా కూర్చొని తన ఎనిమిది చేతుల యందు వివిధ రకాల ఆయుధాలను ధరించి రాక్షస సంహారం గావించి లోక కళ్యాణం జరిపించిన దివ్యమైన రూపంతో భక్తులను బంగారు రంగు చీరలో సాక్షాత్కరిస్తుంది. చవితి పర్వదినం రోజున చండీ పారాయణం, చండీ యాగం చేస్తారు. చండీదేవిగా దర్శనమిచ్చే జగన్మాత కనకదుర్గమ్మకు ఈ రోజున నైవేద్యంగా తెల్ల నువ్వులు కలిపిన బెల్లం పొంగలి, వడలు నివేదిస్తారు.

## పురపాలక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

**అధికారులకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు**

**విజయవాడ,అక్టోబర్, 14,(మనం న్యూస్):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్ జారీ చేసిన నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం సాయంత్రం శాఖాధిపతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, పురపాలక ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, అధికారుల సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, ర్యాంపులు అందుబాటులో ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులు, బాధ్యతలను అధికారులకు కేటాయించిన మేరకు ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న అదనపు కమిషనర్ ఎ. రవీంద్రరావు అన్ని శాఖల అధికారులతో



సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డా. డి. చంద్రశేఖర్ కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, వెబ్కాస్టింగ్కు అవసరమైన సాంకేతిక, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.చీఫ్ సిటీ ప్లానర్ జి. రత్నకుమార్ ఎన్నికలకు అవసరమైన ప్రింటింగ్ మెటీరియల్, రూట్వారీ వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. దేవిన హరీష్ పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసి, అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగరంలో ఒకవైపు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, మరోవైపు సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో, వీటితోపాటు పురపాలక ఎన్నికల ఏర్పాట్లను కూడా అధికారులు సమాంతరంగా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కమిషనర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

## వీఆర్ఏల ఆందోళనలు తాత్కాలికంగా వాయిదా

**గాంధీనగర్ అక్టోబర్ 14 మనం న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలు గత నెల 15వ తేదీ నుంచి తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీఓ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్ల వద్ద శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు, కో కన్వీనర్, వీఆర్ఏల జేఏసీ చైర్మన్ ఎన్. పెద్దన్న తెలిపారు. ఈ మేరకు నిరసనల్లో పాల్గొన్న వీఆర్ఏ సోదర సోదరీమణులందరికీ ఉద్యమ అభినందనలు తెలియజేశారు. వారం రోజుల క్రితం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్తో వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లపై చర్చించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి సమస్యలకు తప్పకుండా పరిష్కారం చూపుతామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే వరకు నిరసన కార్యక్రమాలను కొనసాగించాలని అప్పట్లో నిర్ణయించినట్లు వెల్లడించారు. అయితే ముఖ్యమంత్రి ఇతర కార్యక్రమాలతో బిజీగా ఉండటం, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తాత్కాలికంగా ఆందోళన కార్యక్రమాలను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు వివరించారు. వీఆర్ఏలు ఎవరూ నిరాశ చెందవద్దని, కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందనే ఆశాభావంతో ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే అన్ని జిల్లాల వీఆర్ఏ జేఏసీ నాయకులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని పత్రికా ప్రకటనలో తెలిపారు.

## ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోండి

**క్యాప్కో వైస్ చైర్మన్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు**




**జగ్గయ్యపేట,అక్టోబర్ 14, మనం న్యూస్:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులకు ఉపశమనం కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లతో పాటు మొబైల్ వాహనాల ద్వారా సన్న బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాప్కో) వైస్ చైర్మన్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ధరకు అందిస్తున్న ఫైన్ రైస్ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బుదవారం రైతు బజార్లోని అమ్మకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య వినియోగదారులకు ఊరట కలిగిస్తుందని తెలిపారు. ఈమేరకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు,రాష్ట్ర ప్రభుత్వానికి, సివిల్ సప్లైస్ కమిషనర్ కె. కన్నబాబు కి రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సన్నబియ్యం పథకంపై రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వినియోగదారుల సంఘాల ప్రతినిధులు చొరవ తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన వినియోగదారులకు చేరేలా కృషి చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలపై వినియోగదారుల సంఘాలు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా వ్యవహరించాలని కర్లపాటి కోరారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఈఓ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట కమ్మ సంఘం మాజీ అధ్యక్షులు, గౌతమి స్కూల్ అధినేత బొల్లా శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీలో చేరిక

**శ్రీనివాసరావుకి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజగోపాల్**



**జగ్గయ్యపేట అక్టోబర్ 14 మనం న్యూస్ :** జగ్గయ్యపేట కమ్మ సంఘం మాజీ అధ్యక్షులు, గౌతమి స్కూల్ అధినేత బొల్లా శ్రీనివాసరావు ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం పట్టణంలోని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ నివాసంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో బొల్లా శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే రాజగోపాల్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ, సామాజిక సేవలో, విద్యారంగంలో శ్రీనివాసరావు చేస్తున్న కృషి అభినందనీయమని, ఆయన చేరిక పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ విధానాలు, ఎమ్మెల్యే రాజగోపాల్ నాయకత్వం పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎలమంచిలి రాఘవేంద్ర, పీఏసీఎస్ చైర్మన్ ధూళిపాళ్ల లక్ష్మణరావు,తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ గుమ్మ వెంకటేష్, మాజీ కౌన్సిలర్ కటికల అనిల్ కుమార్, తెదేపా నాయకులు చిలుకూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం తెలుగుదేశం పార్టీలో బహుముఖ పోటీ




**జగ్గయ్యపేట అక్టోబర్ 14 మనం న్యూస్:** జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై అధిష్టానం తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త యువ నేత శ్రీరామ్ ధనుంజయ ( చిన్న బాబు) సతీమణి శ్రీరామ్ శ్రీ వల్లి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అలానే శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ కు స్వయాన బాబాయ్ అయిన మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావు కుమార్తె నరేంద్రుల వినీత పేరు కూడా అధిష్టానం పరిశీలనలో ఉందనే మాట కూడా బలంగా వినిపిస్తోంది. తెలుగుదేశం అభ్యర్థిగా శ్రీరామ్ చినబాబు సతీమణి శ్రీవల్లి ని ప్రకటిస్తే మున్సిపల్ చైర్మన్ గా ఆమె విజయం ఖాయం అనే మాట తెలుగుదేశం వర్గాల నుంచి వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ సమన్వయకర్తగా యువనేతగా శ్రీరామ్ చిన్నబాబు పార్టీని నడిపిస్తున్న తీరు, పట్టణంలో శ్రీరామ్ చినబాబుకు ఉన్న పేరు ప్రఖ్యాతులు, పార్టీలో ఉన్న పట్టు యువతలో ఆయన పట్ల ఉన్న అభిమానం తెలుగుదేశం అభ్యర్థిగా శ్రీరామ్ శ్రీవల్లి విజయం నల్లేరు మీద నడకల మారుతుందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. శాసనసభ్యునిగా శ్రీరామ్ రాజగోపాల్ పనిచేస్తుండగా ఆ ఇంటి నుంచి మరొక అధికార పదవిని అధిష్టానం ఎంపిక చేస్తుందా అనే మాట కూడా వినిపిస్తోంది. మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావు కుమార్తె నరేంద్రుల వినీత మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఖరారు కావచ్చనే మాట తెలుగుదేశం వర్గాల నుంచి వినిపిస్తోంది. మాజీ మున్సిపల్ చైర్మన్, జగ్గయ్యపేట షరాబు వర్తక సంఘం నేత శ్రీరామ్ సుబ్బారావు గత 40 సంవత్సరాల రాజకీయ చరిత్రలో మాజీ మంత్రి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం కు అత్యంత సన్నిహితులుగా పేరుపొందారు. రాజకీయాల కంటే ఆత్మీయతకు స్నేహ బాంధవ్యాలకు విలువ ఇస్తారనే పేరు శ్రీరాం సుబ్బారావుకి ఉంది.శ్రీరామ్ సుబ్బారావు కుమార్తె వినీతను చైర్మన్ అభ్యర్థిగా ప్రకటిస్తే అటు ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, ఇటు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం వర్గాలు ఇరువురు ఏకతాటిపై నిలిచి వినీత విజయానికి కృషి చేస్తారనే మాట వినిపిస్తోంది. కానీ వినీత సైతం అదే కుటుంబానికి చెందిన వ్యక్తి అనే మాట పట్టణంలో ప్రచారంలో ఉంది. ఇక తెలుగుదేశం పార్టీ నుంచి చైర్మన్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సీనియర్ నేత ఎలమంచిలి రాఘవేంద్రరావు సతీమణి ఎలమంచిలి వెంకటలక్ష్మి పేరు బలంగా వినిపిస్తోంది. ఎలమంచిలి రాఘవేంద్రరావు మున్సిపల్ కౌన్సిల్లో తెలుగుదేశం ఫ్లోర్ లీడర్ గా చేశారు. రాఘవేంద్రరావు తండ్రి ఎలమంచిలి దశరథ రామయ్య సైతం మున్సిపల్ కౌన్సిలర్ గా సేవలను అందించారు. ఎలమంచిలి వెంకటలక్ష్మి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గా ప్రశంసనీయమైన సేవలను అందించారు. ఎలమంచిలి వెంకటలక్ష్మి తాను పోటీకి సిద్ధమని ప్రకటించడంతో వారి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలుగుదేశం వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. అలాగే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అంగన్వాడీ మాజీ అధ్యక్షురాలు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ మహిళా నేత ఆచంట సునీత సైతం తాను చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో దశాబ్దాల కాలంగా పార్టీకి సేవలు అందిస్తున్నానని పార్టీ తన సేవలకు గుర్తింపుగా చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేయాలని ఆచంట సునీత కోరుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ తెలుగుదేశం అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తుంది అనేది వేచి చూడాల్సి ఉంది. శ్రీరామ్ శ్రీవల్లి, నరేంద్రుల వినీత ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, ఆచంట సునీత, ఎలమంచిలి వెంకటలక్ష్మి లు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు అధిష్టానం ఎవరిని చైర్మన్ స్థానానికి ఎంపిక చేస్తుంది .లేదా అనూహ్యంగా మరో కొత్త పేరు తెరపైకి వస్తుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

## బొల్లా శ్రీనివాసరావు రాజీనామాతో వైసీపీకి షాక్

**జగ్గయ్యపేట అక్టోబర్ 14 మనం న్యూస్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బొల్లా శ్రీనివాసరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరటం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాకే అనే మాట వినిపిస్తోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావుకు అత్యంత సన్నిహితులైన బొల్లా శ్రీనివాసరావు కమ్మ సామాజిక వర్గంలో మంచి పలుకుబడి కలిగిన నేతగా విద్యాసంస్థల అధిపతిగా పట్టణంలో మంచి పేరు ప్రఖ్యాతులను కలిగి ఉన్నారు. గత మున్సిపల్ ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి వార్డు కౌన్సిలర్ గా సైతం పోటీ చేశారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బొల్లా శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరటం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలకు ముందు తగిలిన షాక్ గా విశ్లేషకులు భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మరికొందరు నేతలు తెలుగుదేశం జనసేన లలో చేరటం ఖాయమనే మాట వినిపిస్తోంది.



## భవిష్యత్ విద్యపై చర్చించిన కేంబ్రిడ్జ్



**గాంధీనగర్ అక్టోబర్ 14 మనం న్యూస్:** మారుతున్న ప్రపంచంలో విద్యార్థులను భవిష్యత్ అవకాశాలకు అనుగుణంగా తీర్చిదిద్దే విద్యా విధానాలపై చర్చించేందుకు కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ విజయవాడలో పాఠశాలల నాయకులతో సమావేశం నిర్వహించింది. జాతీయ, అంతర్జాతీయ విద్యా విధానాల మధ్య వ్యత్యాసాలు తగ్గుతున్న నేపథ్యంలో భారతీయ విద్యార్థులకు దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన విద్యను అందించడంపై సమావేశంలో చర్చించారు. విమర్శనాత్మక ఆలోచన, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం, సృజనాత్మకత, సమర్థవంతమైన సమాచార వినిమయం వంటి నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరాన్ని విద్యావేత్తలు ప్రస్తావించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంతో అభ్యసనం, మూల్యాంకనం, భవిష్యత్ ఉద్యోగాల్లో వస్తున్న మార్పులను పరిశీలించారు. కేంబ్రిడ్జ్ దక్షిణాసియా అంతర్జాతీయ విద్యా విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ శర్మ మాట్లాడుతూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించగల, సమస్యలకు పరిష్కారాలు కనుగొనగల విద్యార్థులను తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర కీలకమన్నారు. గుంటూరులోని లయోలా పబ్లిక్ స్కూల్ ప్రాంతీయ విద్యా కార్యదర్శి మార్క్ సహాయరాజ్ ఈ సమావేశం విలువైన ఆలోచనలను అందించిందని తెలిపారు. విజయవాడలో జరిగిన ఈ సమావేశంలో 10 పాఠశాలలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. మార్చి 2026 పరీక్షల సిరీస్లో 447 పాఠశాలలకు చెందిన 23,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, 91,000కు పైగా పరీక్షా ఎంట్రీలు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే మొత్తం ఎంట్రీలు 7 శాతం, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఏఎస్ అండ్ ఏ లెవల్ ఎంట్రీలు 12 శాతం పెరిగాయి.

### ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో

# ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు!



- **డిసెంబర్ 19లోగా స్పష్టమైన ప్రకటన చేయాలి**
- **లేనిపక్షంలో రాష్ట్రస్థాయి ఉద్యమం చేపడతాం**
- **ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ దూసి భానుజీ రావు**

**గాంధీనగర్ అక్టోబర్ 14 మనం న్యూస్:** ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదనీ ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ దూసి భానుజీ రావు అన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించి స్పష్టమైన ప్రకటన చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడం తగదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారిస్తున్న ప్రభుత్వం, అదే శాఖల్లో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు.ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు, ఉద్యోగులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అర్హతలు, విధుల స్వభావం, వర్తించే చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.దీర్ఘకాలంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే అంశంపై నిర్ణయం తీసుకోవాలని,ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం, సేవా నిబంధనలు, వేతనాలు, సెలవులు తదితర అంశాలకు సంబంధించి సమగ్ర హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి.ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. 12వ వేతన సవరణ పి.ఆర్.సి లో సీనియార్టీ బట్టి మరియు క్యాడర్ బట్టి జీతాలు పెంచాలని,డిసెంబర్ 19వ తేదీలోగా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సంఘటిత పోరాటం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ అడ్వైజర్. నంబూరు శ్రీనివాసరావు,రాష్ట్ర కోశాధికారి యు.అనిల్ కుమార్, సెక్రటరీ ఎస్.కె. మస్తాన్, రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ రాజేశ్వరి, గుంటూరు జిల్లా అధ్యక్షులు బ్రహ్మయ్య, కృష్ణా జిల్లా అధ్యక్షులు కుమార్, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ వరప్రసాద్తో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# చిల్లకల్లు ఎస్ఐగా షబ్బీర్ అహ్మద్ బాధ్యతల స్వీకారం

**జగ్గయ్యపేట అక్టోబర్ 14 మనం న్యూస్:** చిల్లకల్లు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా షబ్బీర్ అహ్మద్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో వీరు జి కొండూరు, సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయులతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అసాంఘిక శక్తుల గురించి సమాచారాన్ని అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.




# జగ్గయ్యపేట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఇంటూరి శ్రీలత

- **అధికారిక ప్రకటనే తరువాయి**
- **పట్టణంలో మిఠాయిలు పంచిన ఇంటూరి చిన్న అనుచర వర్గం**



**జగ్గయ్యపేట అక్టోబర్ 14 మనం న్యూస్:** జగ్గయ్యపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ అభ్యర్థిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంటూరి శ్రీలత ను ఖరారు చేసినట్టు విశ్వసనీయ వర్గాలద్వారా తెలుస్తోంది. మాజీ మున్సిపల్ చైర్మన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఫైర్ బ్రాండ్ నేత గా పేరు పడ్డ ఇంటూరి రాజగోపాల్ సతీమణి ఇంటూరి శ్రీలత, ఇంటూరి రాజగోపాల్ (చిన్న) అటు తెలుగుదేశంలో ఉన్నప్పుడు అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీ పైన, తరువాతవైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా అధికార తెలుగుదేశం పార్టీ పైన తనదైన శైలిలో పోరాటాలను చేసి ఫైర్ బ్రాండ్ గా పేరు సంపాదించారు. 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీలో విజయ పతాకం ఎగురవేయగా ఒప్పందం ప్రకారం తన్నీరు నాగేశ్వరరావు తర్వాత రెండు సంవత్సరాలు ఇంటూరి చిన్న మున్సిపల్ చైర్మన్ గా పదవీ బాధ్యతలను నిర్వహించారు. రెండు సంవత్సరాలలో మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయించడమే కాక , ఎర్ర కాలవ ప్రక్షాళన కోసం చేపట్టిన కార్యక్రమంలో స్వయంగా ఆయనే కాలువలో దిగి చెత్తను కూడా తొలగించిన సందర్భాలు ఉన్నాయి. పనిచేయని అధికారులను సిబ్బందిని ప్రశ్నించి పట్టణంలో ప్రజా లకు సమస్యలు కలగకుండా అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నదే లక్ష్యంగాఇంటూరి చిన్న తన రెండు సంవత్సరాల మున్సిపల్ చైర్మన్ పాలనలో సేవలను అందించారు. ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ర్యాలీలో తెలుగుదేశం, జనసేన నేతలపై ఇంటూరి చిన్న సంధించిన విమర్శనాస్త్రాలు తీవ్ర చర్చనీయాంశమైన విషయం విధితమే. ఇంటూరి రాజగోపాల్ తండ్రి ఇంటూరి విజయ రామారావు, తల్లి ఇంటూరి హైమావతి లు సైతం మున్సిపల్ కౌన్సిలర్లు గా పదవీ బాధ్యతలను నిర్వర్తించారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఇంటూరి రాజగోపాల్ ( చిన్న )సతీమణి ఇంటూరి శ్రీలత పేరు చైర్మన్ అభ్యర్థిగా ఖరారు అయిందన్న వార్త తో పట్టణవాసులు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశం పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ధీ టైన అభ్యర్థినే ఎంపిక చేసిందని మాట వినిపిస్తోంది. ఇంటూరి శ్రీలత పేరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఖరారైంది అన్న సమాచారంతో ఇంటూరి చిన్న అనుచరులు పట్టణంలో మిఠాయిలను పంపిణీ చేశారు.

# నియోజకవర్గంలో వేగంగా అభివృద్ధి



**తాడేపల్లి, అక్టోబర్ 14, మనం న్యూస్:** మంగళగిరి నియోజకవర్గంలోని ఇప్పటం గ్రామంలో సుమారు రూ.70 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నందం అబద్దయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శనియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నారా లోకేష్ పనిచేస్తున్నారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

### రూ.2,500 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి: ముమ్మిడి సత్యనారాయణ

టీడీపీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇప్పటం గ్రామంలో రూ.70 లక్షల అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని, వాటికి శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం గతంలో ఎన్నడూ లేని పరిణామమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్న నాయకత్వంలో మంగళగిరికి ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి భారీ మెజారిటీ సాధించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

### గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత: శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు శంకరశెట్టి పిచ్చయ్య

శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు శంకరశెట్టి పిచ్చయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటం గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గ్రామంలో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, సుమారు రూ.కోటితో చెరువు అభివృద్ధి, శివాలయం పక్కన రూ.70 లక్షలతో కల్యాణ మండపం వంటి పనులు చేపట్టినట్లు వివరించారు.గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనుల కోసం మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నిధుల మంజూరుకు చర్యలుతీసుకుంటున్నారని చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థ, పైపులైన్లు తదితర మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి జరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చూపుతున్న చొరవతో ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాడేపల్లి మండల మహిళ అధ్యక్షురాలు బొర్ర కృష్ణ వందన, ఇప్పటం టీడీపీ గ్రామ అధ్యక్షులు జముడుగాని రత్తయ్య, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు గాజుల రాంబాబు,బీజేపీ గ్రామ అద్యక్షులు సాధు నాగేశ్వరరావు, శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యుడు కాటూరు నాగేశ్వరరావు,జనసేన పార్టీ ఎంటిఎంసి ఉపాధ్యక్షులు సాధు చంద్రశేఖర్, తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి శ్రీధర్,మండల కార్యదర్శి ఇండ్ల జగదీష్,టీడీపీ ఇప్పటం గ్రామ ప్రధాన కార్యదర్శి గాజుల నగేష్,తాడేపల్లి తెలుగు యువత కార్యదర్శి,జెముడు గాని మహేంద్ర,అమీరి శెట్టి వెంకటేశ్వర్లు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు,నీటి సంఘం అధ్యక్షులు సాదు కొండల రావు, కార్యనిర్వా హన కార్యదర్శి పాగోలు సుబ్బారావు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలి

**▸▸ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ,అక్టోబర్,14,(మనం న్యూస్):** ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులోకి వచ్చినందున, విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన ప్రత్యేక టెలికాన్ఫరెన్స్లో అధికారులకు, సిబ్బందికి ఎన్నికల విధుల నిర్వహణ, నియమావళి అమలుపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా నగరంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం, రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు, ప్రచార సామగ్రిని తొలగించడం వంటి చర్యలను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల విధుల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు సంబంధించి ప్రతి పనిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి వర్తించే 100 మీటర్ల నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల విధులు అత్యంత ప్రాధాన్యమైనవైనప్పటికీ, ప్రజలకు అందించాల్సిన సాధారణ పౌర సేవలు, రోజువారీ ప్రభుత్వ




కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ ధ్యానచంద్ర స్పష్టం చేశారు.

# ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్



**హనుమాన్ జంక్షన్: అక్టోబర్ 14 ( మనం న్యూస్ ):** ఏలూరు జిల్లా ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా వెలుగుల సురేష్ నియమితులయ్యారు. ప్రస్తుతం అక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న హనుమంతు నాగరాజు బదిలీ కావటంతో ఆయన స్థానంలో వెలుగుల సురేష్ ను పోలీస్ ఉన్నత అధికారులు నియమించారు.ఈ మేరకు బుధవారం ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ లో ఆయన బాధ్యతలు స్వీకరించారు.గతంలో హనుమాన్ జంక్షన్ ఎస్ఐగా సురేష్ పని చేసి ప్రజల మన్ననలు పొందారు.

# పేద కుటుంబానికి అండగా ఎమ్మెల్యే



**గుంటూరు, అక్టోబర్14 (మనం న్యూస్ ప్రతినిధి) :** పేద కుటుంబాల కష్టాలను గుర్తించి, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని నిరూపించిన మన ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు,మానవతా దృక్పథంతో స్పందించారు.గుంటూరు నగరంలోని గోరంట్లకు చెందిన పేరం హరీష్, రమాదేవి దంపతుల కుమారులు జయకృష్ణ, సాయిరామ్ గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆ కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు,నివాస సమస్యలు వెలుగులోకి వచ్చాయి.ఈ కథనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రామాంజనేయులు. తక్షణమే స్పందించి,సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్, ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి వెంగలాయపాలెంలో టిడ్కో గృహాన్ని కేటాయించేలా చర్యలు తీసుకొని, స్వయంగా బాధిత కుటుంబానికి ఇంటి తాళాలను అందజేసి,వారికి నివాస భరోసా కల్పించారు. గత వైకాపా ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించి కట్టిస్తామని చెప్పి ఐదేళ్లు కాలం గడిపేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో అండగా నిలిచి,ప్రజల కష్టాలను గుర్తించడం మాత్రమే కాదు,వాటికి పరిష్కారం చూపుతూ బాధిత కుటుంబాలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# హోల్డింగ్ ఏరియాల్లో భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు.. పరిశుభ్రమైన వాతావరణం




**▸▸ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ,అక్టోబర్,14,(మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం సాయంత్రం వినాయకుని గుడి, కెనాల్ రోడ్, వన్టౌన్ ప్రాంతాల్లోని హోల్డింగ్ ఏరియాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులకు విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో హోల్డింగ్ ఏరియాల్లో నిరంతర తాగునీటి సదుపాయంతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తాగునీటి సౌకర్యాలను అందుబాటులో ఉంచడంతోపాటు, వినియోగించిన వాటర్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను సేకరించేందుకు డస్ట్బిన్లను ఏర్పాటు చేసి నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నారు. హోల్డింగ్ ఏరియాల్లో భక్తుల రాకపోకలు నిరంతరం కొనసాగుతున్నప్పటికీ, ప్రతి కంపార్ట్మెంట్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. ఒక విడత భక్తులు ముందుకు సాగిన వెంటనే తదుపరి విడత భక్తులకు కూడా శుభ్రమైన పరిసరాలు అందుబాటులో ఉండేలా పారిశుద్ధ్య కార్యకలాపాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. భక్తుల ఆరోగ్యం, సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ విజయవాడ నగరపాలక సంస్థ సమర్థవంతమైన పారిశుద్ధ్య నిర్వహణతో మెరుగైన వాతావరణాన్ని అందిస్తోంది. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. సి.హెచ్. నిర్మల గ్లోరీ, ఎండోమెంట్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమాదేవి, సంబంధిత సిబ్బంది, పాల్గొన్నారు.

# గుంటూరు జి జి హెచ్‌లో వైద్య రంగంలో ఒక విశేషమైన ముందడుగు

**గుంటూరు జి జి హెచ్ అక్టోబర్ 14 (మనం న్యూస్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యరంగంలో ఒక విశేషమైన ముందడుగుగా, గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జి జి హెచ్) యూరాలజీ విభాగం వైద్యులు అత్యంత క్లిష్టమైన లాపరోస్కోపిక్ వెసికోవాజైనల్ ఫిస్టులా (వి వి యఫ్) రిపేర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు .రాష్ట్ర ప్రభుత్వ వైద్యరంగంలో ఈ తరహా శస్త్రచికిత్స తొలిసారిగా నిర్వహించిన ఘనతను జిజిహెచ్ గుంటూరు సాధించింది.గత ఆరు నెలలుగా నిరంతర మూత్ర లీకేజీతో బాధపడుతూ, ఇంటి నుంచి బయటకు కూడా రాలేని పరిస్థితిలో ఉన్న మహిళకు ఈ అధునాతన శస్త్రచికిత్స నిర్వహించారు. మూత్రాశయం, యోని మధ్య ఏర్పడిన అసాధారణ మార్గాన్ని లాపరోస్కోపిక్ విధానంలో సరిచేశారు.యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ మనోహర్ నాయకత్వంలో,డాక్టర్ కార్తీక్ ఆరే,డాక్టర్ రాకేష్ ఈ క్లిష్టమైన లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.వీరికి డాక్టర్ సమ్మోహిత్తో పాటు ఇతర వైద్య సిబ్బంది సహకరించారు.అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, డాక్టర్ దీపక్ మరియు అనస్థీషియా బృందం ఈ శస్త్రచికిత్సలో కీలక పాత్ర పోషించారు. జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సాధించిన ఈ విజయం ప్రభుత్వ వైద్యరంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ. 2 లక్షలకు పైగా ఖర్చయ్యే ఇటువంటి అధునాతన శస్త్రచికిత్సలను ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావడం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరం.అధునాతన వైద్యం సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే జి జి హెచ్ గుంటూరు లక్ష్యం.



# అర్హులైన ఉపాధ్యాయులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి

**▸▸ ఎలక్టోరల్ రోల్స్ రూపకల్పనలో ఎలాంటి ఫిర్యాదులకు తావివ్వొద్దు**

**▸▸ ఆరు జిల్లాల అధికారులతో సమీక్షించిన డి ఆర్ ఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి**



**గుంటూరు, అక్టోబర్ 14: (మనం న్యూస్ ప్రతినిధి):** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఎలక్టోరల్ రోల్స్ తయారీలో అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడిని ఓటరుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి అధికారులను ఆదేశించారు.ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గ ఎన్నికల ఓటరు జాబితా తయారీపై బుధవారం ఏలూరు,కృష్ణా,ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన రెవెన్యూ అధికారులు,ఎంపీడీవోలు యం ఈ ఓ లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాల తయారీ, ఉపాధ్యాయుల అర్హతలు, నమోదు ప్రక్రియ, నిర్ణీత గడువులోగా జాబితాల ప్రచురణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఎలక్టోరల్ రోల్స్ తయారీలో ఎలాంటి పొరపాట్లకు, ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఉన్నత పాఠశాలలు, ఆపై స్థాయి విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో ఓటరుగా నమోదయ్యేందుకు అర్హులని తెలిపారు.నవంబర్ 1, 2026 నాటికి గత ఆరు సంవత్సరాల కాలంలో కనీసం మూడు సంవత్సరాల బోధనా అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సాధారణ ఓటరుగా నమోదై ఉండాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ గుర్తింపు కలిగి ఉండాలని వివరించారు. పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఓటరుగా నమోదుకు అర్హులు కారని స్పష్టం చేశారు. ఓటరు నమోదుకు సంబంధించిన నిబంధనలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులైన ఉపాధ్యాయులెవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎలక్టోరల్ రోల్స్ తయారీకి సంబంధించి నవంబర్ 25, 2026న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు, డిసెంబర్ 30, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఈ గడువులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిర్ణీత సమయంలోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు నమోదు అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. విస్తృత ప్రచారం ద్వారా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి, ఎలక్టోరల్ రోల్స్ తయారీ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.కె ఖాజావలి సూచించారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ



గుంటూరు అక్టోబర్ :14 (మనం న్యూస్ ప్రతినిధి) నగర పరిధిలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో గుంటూరు జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్ ఐపీఎస్ ఈరోజు స్థానిక అధికారులతో కలిసి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా గుంటూరు నగరంలోని నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటప్పయ్య కాలనీ ఎంపీపీ స్కూల్,ఏటీ అగ్రహారం ఎస్కేబీఎం స్కూల్, పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జేకేసీ కాలేజ్, అరండల్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజీవయ్య నగర్ ఎంపీపీ స్కూల్, కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జలగం రామారావు మున్సిపల్ హైస్కూల్,ప్రభుత్వ ఉర్దూ బాయ్స్ హైస్కూల్, పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇజ్రాయిల్పేట ఎంపీపీ హైస్కూల్,బుర్ర నాగేశ్వరరావు మున్సిపల్ హైస్కూల్, యాదవ హైస్కూల్, లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మహావీర్ స్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు,బారికేడ్ల ఏర్పాటు,అవసరమైన మౌలిక సదుపాయాలు,ఓటర్ల రాకపోకలకు అనుగుణంగా క్యూ లైన్ల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించే మార్గాలు, పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిని ఎస్పీ గారు క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల సమీపంలోని ఇళ్ల యజమానుల వివరాలను సేకరించాలని,పోలింగ్ జరిగే రోజున కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా అక్కడ నివాసం ఉండకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# మేఘ కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు



గుంటూరు, అక్టోబర్ 14: (మనం న్యూస్ ప్రతినిధి) రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో,ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడంతోపాటు నేరాలను నియంత్రించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం,లక్ష్యంగా.గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో బుధవారం తెల్లవారుజామున విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. సంబంధిత సబ్ డివిజన్ల డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, సివిల్ పోలీసు సిబ్బంది, స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఎస్ టి ఎఫ్ సిబ్బంది సమన్వయంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహనాల పత్రాల్లో లోపాలను గుర్తించారు.కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించిన ప్రాంతాలు.1. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధి - కృష్ణబాబు కాలనీ, గుంటూరు నగరంలోని కృష్ణబాబు కాలనీలో వెస్ట్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, పర్యవేక్షణలో ఉదయం 05:30 గంటల నుంచి 07:30 గంటల వరకు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 30 ద్విచక్ర వాహనాలు, ఒక మినీ వ్యాన్కు సంబంధించిన పత్రాల్లో లోపాలను గుర్తించారు.అక్రమ ఆయుధాల కోసం కూడా తనిఖీలు నిర్వహించారు.2. మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధి - డోకిపర్రు గ్రామం.తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షణలో తెల్లవారుజామున 04:30 గంటల నుంచి 07:45 గంటల వరకు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 18 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు సంబంధించిన పత్రాల్లో లోపాలను గుర్తించారు. నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.3. దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధి - చెన్నకేశవ నగర్ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్, ఆదేశాల మేరకు నార్త్ డీఎస్పీ కే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెన్నకేశవ నగర్, దుగ్గిరాల గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్లో మంగళగిరి టౌన్, మంగళగిరి రూరల్, పెదకాకాని సీఐలు, దుగ్గిరాల ఎస్ఐతో పాటు సుమారు 35 మంది పోలీసు సిబ్బంది పాల్గొని తనిఖీలు చేపట్టారు. 9 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.4. తెనాలి 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి తెనాలి 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లో సరైన పత్రాలు లేని 36 ద్విచక్ర వాహనాలను గుర్తించారు.5. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధి - వడ్డెర గూడెం లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర గూడెంలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లో సరైన పత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల అనంతరం నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం , లాలాపేట సీఐ శివప్రసాద్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, పాల్గొన్నారు.6. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధి - పాత మల్లయ్యపాలెం గ్రామం సౌత్ డీఎస్పీ పర్యవేక్షణలో, ప్రత్తిపాడు సీఐ, ఆధ్వర్యంలో పాత మల్లయ్యపాలెం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వట్టిచెరుకూరు సీఐ, పెదనందిపాడు, కాకుమాను, నల్లపాడు ఎస్ఐలతో పాటు సుమారు 40 మంది సివిల్ మరియు స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఛీఛీఊ) పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ స్టేట్ 45వ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ విజేతలను అభినందించిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్



గుంటూరు, అక్టోబర్ 14: (మనం న్యూస్ ప్రతినిధి) ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అక్టోబర్ 10, 11 తేదీలలో నిర్వహించిన ఏపీ స్టేట్ 45వ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు బుధవారం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ ని, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ పోటీల్లో క్రీడాకారులు సాధించిన పతకాల వివరాలు:1. ఎం. లక్ష్మయ్య:పీసీ,హ్యామర్ త్రో, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో విభాగాల్లో రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారు.2. డి కిరణ్ కుమార్:పీసీ,1500 మీటర్లు, 5కే రన్ విభాగాల్లో ఒక బంగారు, ఒక రజత పతకం సాధించారు.3. జి. కృష్ణ కిషోర్ హోంగార్డ్ : 5 కె వాక్, 10కే రన్, హైజంప్ విభాగాల్లో రెండు బంగారు, ఒక రజత పతకం సాధించారు.4.ఎం అశోక్ చక్రవర్తి పీసీ :5జా వాక్ విభాగంలో ఒక రజత పతకం సాధించారు.5. బి. కృష్ణారావు:పీసీ హ్యామర్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో ఒక బంగారు, ఒక రజత పతకం సాధించారు.6. మైల సాంబశివరావు:ఏఎస్ ఐ,పోల్ వాల్ట్, 400 మీటర్ల రన్, హైజంప్ విభాగాల్లో రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. 7. ఐ.ఆర్. చంద్రశేఖర్: ఏ ఆర్ ఎస్ ఐ,హ్యామర్ త్రో, డిస్కస్ త్రో,షాట్పుట్ విభాగాల్లో ఒక బంగారు, రెండు రజత పతకాలు సాధించారు. 8. కె. రాజశేఖర్ బాబు: రిటైర్డ్ (ఏ ఎస్ ఐ )10కే రన్, వాక్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించారు. 9. వి. దివాకర్: హ్యామర్ త్రో, షాట్పుట్, డిస్కస్ త్రో విభాగాల్లో రెండు బంగారు,ఒక రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ విజేతలను అభినందించి, క్రీడల్లో వారు సాధించిన విజయాల పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# ఎన్నికల ప్రకటన విడుదల . నియమావళి పక్కాగా అమలు చేయాలి



గుంటూరు, అక్టోబర్ 14 : (మనం న్యూస్ ప్రతినిధి) స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనను రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఎన్నిల ఎన్నికల ప్రకటన విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి తక్షణం అమలులోకి వచ్చిందని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జిల్లా అధికారులు, స్థానిక సంస్థల అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన మేరకు నగర పాలక సంస్థలు, పురపాలక సంస్థలు,ఎంపీటీసీ - జడ్పిటిసి,గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థకు,తెనాలి పురపాలక సంస్థకు జిల్లాలో ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. అక్టోబర్ 16వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి,అదే రోజు నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని చెప్పారు.నామినేషన్లను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. అక్టోబర్ 18 వ తేదీన నామినేషన్ల దాఖలు చేయుటకు చివరి తేదీ అని తెలిపారు.19వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుందని,21వ తేదీన అభ్యర్థిత్వం ఉపసంహరణకు ఆఖరు తేదీ అని వివరించారు. 21వ తేదీన పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రకటన చేయడం జరుగుతుందని చెప్పారు.28వ తేదీన ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని,30వ తేదీన ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటల నుండి ప్రారంభమవుతుందని అన్నారు.ఎంపీటీసీ జడ్పిటిసి లకు నోటిఫికేషన్ విడుదల అనంతరం నవంబర్ మూడవ తేదీన పోలింగ్ జరుగుతుందని,ఐదవ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని చెప్పారు.గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు ఘల్లో దశలలో జరుగుతుందని,డిసెంబర్ రెండవ తేదీ నాటికి చివరి దశ పూర్తి అవుతుందని వివరించారు.జిల్లాలో మొత్తం 207 గ్రామ పంచాయతీ లకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు.జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని స్పష్టం చేశారు. స్టాటిక్ టీమ్ లు, సర్వేలియన్స్ టీములు, ఫ్లయింగ్ స్క్వాడ్ ల నియామకం జరిగిందని అన్నారు. ఎన్నికల నియమావళిని అందరి అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.ఎక్కడ లోపాలు ఉండరాదని స్పష్టం చేశారు. 50 వేలకు పైగా నగదు తీసుకు వెళ్ళుటకు అవకాశం లేదని, పెద్ద స్థాయిలో కానుకలు, మద్యం సరఫరా,రవాణా జరగరాదని సూచించారు. మద్యం విక్రయాలపై ప్రతిరోజు స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారులకు,మున్సిపల్ కమిషనర్లకు,కంట్రోల్ రూమ్ కు నివేదికలు సమర్పించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు.మద్యం విక్రయాలపై పూర్తిస్థాయి నిఘా ఉండాలని చెప్పారు.గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం. గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ నిబంధనలు పక్కాగా పాటించాలి



**నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అధారిటీ మయూర్ అశోక్ హెచ్చరిక**

గుంటూరు నగర పాలక సంస్థ అక్టోబర్ 14 (మనం న్యూస్ ప్రతినిధి): ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తక్షణమే అమలులోకి వచ్చిందని,ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అధారిటీ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు.బుధవారం నిర్వహించిన ప్రత్యేక టెలికాన్ఫరెన్స్లో ఆయన అధికారులకు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎసిని అమలు దృష్ట్యా గుంటూరు నగరంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయటంతో పాటు పోస్టర్స్, బ్యానర్స్ తొలగించే చర్యలు ప్రారంబించామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సిబ్బంది అంతా 'డబుల్ అలర్ట్'గా ఉండాలని సూచించారు. కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో సమర్థవంతమైన నిర్వహణ అత్యంత ప్రధానమని, ఉద్యోగులందరికీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సెలవులను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఆదేశాలు వాట్సాప్ లేదా అధికారిక గ్రూపులలో పోస్ట్ చేసిన వెంటనే సిబ్బంది తమకు కేటాయించిన విధులకు తక్షణమే హాజరుకావాలని, సమాచారం తెలియదనే సాకులు ఎంతమాత్రం చెల్లవని స్పష్టం చేశారు. ఉద్యోగులందరూ రాజకీయ తటస్థత వహించాలని, ఏ అభ్యర్థి లేదా రాజకీయ నాయకుడితో ప్రచారాల్లో పాల్గొనడం కానీ,సోషల్ మీడియా వేదికగా రాజకీయ మద్దతు తెలపడం కానీ పూర్తి నిషిద్ధమని స్పష్టం చేశారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఉన్న రాజకీయ పోస్టర్లు, బ్యానర్లను వెంటనే తొలగించాలని,ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు లేదా కానుకల పంపిణీ వంటివి జరుగుతున్నట్లు దృష్టికి వస్తే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పనికి కేటాయించిన గడువును పాటిస్తూ వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల లోపల ప్రచారాలకు తావులేకుండా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.ఎన్నికల విధులు అత్యంత ప్రాధాన్యమైనవి అయినప్పటికీ దైనందిన రెగ్యులర్ ప్రభుత్వ పనులు ఆగిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

# సల్లంగా చూడు... మాయమ్మ

## ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్లను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**(విజయవాడ,మనం బ్యూరో చీఫ్):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సందర్శించి, శ్రీ మహా చండీదేవి అలంకృత కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్రపతిగా విజయవాడకు విచ్చేసిన ఆమెకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతి భక్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు సైతం అభివాదం చేస్తూ ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ అర్చక స్వాములు, వేద పండితులు సంప్రదాయ ఆలయ మర్యాదలతో రాష్ట్రపతికి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అంతరాలయంలోకి వెళ్లి శ్రీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాష్ట్రపతి సుమారు 8 నిమిషాల పాటు అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీస్సులు, ప్రసాదాలు అందజేశారు. దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించగా, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శేష వస్త్రాలను రాష్ట్రపతికి అందజేశారు.



# ఎంపీటీసీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు



**గుంటూరు, అక్టోబర్ 14 : (మనం న్యూస్ ప్రతినిధి)** ఎంపీటీసీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటీ సీఎం సాయికాంత్ వర్మ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆర్వోలు ఏఆర్వోల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గుంటూరు రూరల్ కు జిల్లా సహకార అధికారి ఇ.రత్నావతి రిటర్నింగ్ అధికారిగా, ఎంపీడీవో ఐ.సావిత్రి , తాసిల్దార్ పీఏ కిరణ్ కుమార్ సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. మేడికొండూరు మండలానికి జిల్లా వ్యవసాయ అధికారి ఎం పద్మావతి రిటర్నింగ్ అధికారిగా, ఎంపీడీవో కే డేవిడ్ ప్రభాకర్, తాసిల్దార్ జి రాఘవరావు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు. పెదకాకాని మండలానికి జిల్లా అటవీ అధికారి ఎం హిమ శైలజ ఆర్వోగా,ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు, తాసిల్దార్ పీ కృష్ణకాంత్ ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు. పెదనందిపాడు మండలానికి ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి పి జి ప్రసూన ఆర్ఓగా, ఎంపీడీవో జీ లక్ష్మీదేవి,తాసిల్దార్ కే కళ్యాణి ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.ఫిరంగిపురం మండలానికి జిల్లా బీసీ సంక్షేమ అధికారి కే మయూరి ఆర్వోగా,ఎంపీడీవో పి శివ సుబ్రహ్మణ్యం, తాసిల్దార్ జే ప్రసాదరావు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు. ప్రత్తిపాడు మండలానికి గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె ప్రసాద్ ఆర్ వో గా,ఎంపీడీవో కే శివ పార్వతి, తాసిల్దార్ కే వెంకటేశ్వరరావు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.వట్టిచెరుకూరు మండలానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి శంకర్ ఆర్ వో గా,ఎంపీడీవో ఏ అలీషా బాబు, తాసిల్దార్ కే రాజీవ్ కుమార్ ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు. చేబ్రోలు మండలానికి జిల్లా సరఫరా అధికారి పి కోమలి పద్మ ఆర్ వో గా, ఎంపీడీవో టీ ఉషారాణి, తాసిల్దార్ కే శ్రీనివాసరావు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు. దుగ్గిరాల మండలానికి ఏపీ మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ టి నరసింహారెడ్డి ఆర్వోగా, ఎంపీడీవో ఆదిగోప్పుల శ్రీనివాసరావు,తాసిల్దార్ ఐ సునీత వ్యవహరిస్తారు. కాకుమాను మండలానికి భూగర్భ జల ఉపసంచాలకులు బి వందనం ఆర్వోగా,ఎంపీడీవో జి వీరస్వామి,తాసిల్దార్ బి వెంకటస్వామి ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.కొల్లిపర మండలానికి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం. క్రిష్టి అభినవ్ ఆర్వోగా, ఎంపీడీవో బి విజయలక్ష్మి, తాసిల్దార్ జి సిద్ధార్థ ఏ ఆర్ ఓ లుగా వ్యవహరిస్తారు. పొన్నూరు మండలానికి డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి విజయలక్ష్మి ఆర్వోగా, ఎంపీడీవో జి చంద్రశేఖర్, తాసిల్దార్ జియా ఉల్ హక్ ఏ ఆర్ ఓ లుగా వ్యవహరిస్తారు. తెనాలి మండలానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డి దుర్గాభాయి ఆర్వోగా, ఎంపీడీవో ఏ దీప్తి, తాసిల్దార్ కె వి గోపాలకృష్ణ ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

# నడింపాలెంలో రూ.5.50 కోట్ల వ్యయంతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**గుంటూరు అక్టోబర్ :14( మనం న్యూస్ ప్రతినిధి )**ప్రత్తిపాడు మండలం, నడింపాలెం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న కేంద్ర యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా సంస్థ (ఇఇఖ్లా)కు చెందిన 100 పడకల ఆసుపత్రి మౌలిక వసతుల కల్పనలో భాగంగా మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలనే ఉద్దేశంతో రూ.5.50 కోట్ల వ్యయంతో ఆర్ సి సి వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా.బూర్ల రామాంజనేయులు.ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ, సహకారంతో,సీఎం చంద్రబాబు నాయకత్వంలో,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,ఆశీస్సులతో దేశంలోనే 4 వ ప్రాజెక్టుగా అందులో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని నడింపాలెం గ్రామంలో ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటు కావడం మనందరి అదృష్టమని,కేంద్ర యోగా, ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ 100 పడకల ఆసుపత్రి కానుందని,అందులో భాగంగా బుధవారం రూ.5.5 కోట్ల వ్యయంతో డ్రైనేజీ వ్యవస్థను నిర్మాణం చేపట్టడం జరిగిందని, కేంద్ర రాష్ట్ర సహకారంతో ఈ నిర్మాణం ఏర్పాటు కావడం మనందరి అదృష్టమని, శరవేగంగా మౌలిక వసతుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ నిర్మాణం పూర్తయితే ఆసుపత్రి పరిసరాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా నియంత్రించేందుకు,పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు, రోగులు మరియు వైద్య సిబ్బందికి మెరుగైన వాతావరణాన్ని కల్పించేందుకు దోహదపడుతుంది.జాతీయ స్థాయి యోగా,ప్రకృతి వైద్య పరిశోధనా సంస్థకు అనుబంధంగా ఏర్పాటవుతున్న ఈ 100 పడకల ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు గింజుపల్లి శివరాంప్రసాద్,కూటమి నాయకులు,అభిమానులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ సరస్ మేళాలో వైద్య శిబిరాలు, ఐసీయూ యూనిట్ను పరిశీలించిన ఉన్నతాధికారులు



విజయవాడ,అక్టోబర్,14,(మనం న్యూస్): జాతీయ సరస్ మేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను, ఐసీయూ యూనిట్ను డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ వెంకటరమణ, ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రావణ బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ మాధవి దేవి సందర్శించి పరిశీలించారు. మేళాకు విచ్చేసే ప్రజలు, సందర్శకులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సహాయం అందించేలా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మందులు మరియు వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## భోగాపురంలో వివాహ వేడుకకు హాజరైన వైయస్ జగన్



విజయనగరం, అక్టోబర్, 14,(మనం న్యూస్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ విజయనగరం జిల్లా భోగాపురంలో పర్యటించారు. భోగాపురంలోని సన్ రే విలేజ్ రిసార్ట్లో జరిగిన వైఎస్సార్సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఉప్పాడ శివారెడ్డి వివాహ వేడుకకు వైయస్ జగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు తనూజ-శివారెడ్డిలను ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో ఆనందమయమైన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.

## ప్రత్యేక విమానంలో విజయవాడ చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**▸▸ రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు**

గన్నవరం, అమరావతి,: అక్టోబరు 14,(మనం ప్రతినిధి): బుధవారం సాయంత్రం 6:10 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పలు కార్యక్రమాలలో పాల్గొను నిమిత్తం గన్నవరం చేరుకున్న రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ తో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, రాష్ట్ర గనులు, భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు భారత రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి భద్రత బలగాల నడుమ ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



## ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి జోరు పర్యటన



ఆత్మకూరు: అక్టోబర్ 14 (మనం న్యూస్): ఆత్మకూరు పట్టణంలో పలు పర్యటనల నేపథ్యంలో ముందుగా వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య నివాసానికి విచ్చేసిన ఆత్మకూరు మాజీ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి. ఉదయగిరి నియోజకవర పరిశీలకులు కూనం సుధాకర్ రెడ్డి. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికలపై సమాలోచనలు చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో వైసీపీ కైవసం చేసుకుంటుందని మేకపాటి విక్రం రెడ్డి అన్నారు. ప్రజలంతా వైసిపి వైపే ఉన్నారని త్వరలోనే రిజల్ట్ చూస్తారు అన్నారు. పై కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ విభాగం సెక్రటరీ అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి , పట్టణ అధ్యక్షులు నాగులపాటి ప్రతాప్ రెడ్డి , యువ నాయకుడు నోటి వినయ్ కుమార్ రెడ్డి , పులిమి వెంకట రమేష్ రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, చిల్లూరు వెంకటేశ్వర్లు, బత్తిన నారాయణ రెడ్డి, ఖాజావళి, వెంగల్ రెడ్డి, బంక వెంకటేశ్వర్లు, మల్లెం కొండయ్య, శ్రీనివాసులు, జమ్ము తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ ఉత్సవ్ 2.0లో పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాస్వాన్, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎంపీ కేశినేని చిన్ని

**విజయవాడ ఉత్సవ్ ద్వారా నగర సంస్కృతి, సంప్రదాయాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు**



విజయవాడ,అక్టోబర్, 14, (మనం బ్యూరో ): విజయవాడ( మాకినేని బసవ పున్నయ్య స్టేడియం)కృష్ణమ్మ నదీ తీరాన పున్నమి ఘాట్ వేదికగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలు నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడ నగర సాంస్కృతిక వైభవాన్ని, కళలను, సంప్రదాయాలను దేశవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ వివిధ కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు సందర్శకులను అలరిస్తున్నాయి. విజయవాడ ఉత్సవ్తో పాటు జాతీయ స్థాయి సరస్ మేళా నిర్వహణ నగరానికి మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంతో పాటు, మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేలా సరస్ మేళా కొనసాగుతోంది. ఈ కార్యక్రమాల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాస్వాన్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, చైర్మన్లు పట్టాభి, రఘురామరాజు, ఎరబోతు రమణ, తేజస్వి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ ప్రతినిధి ముత్తవరపు మురళి, సినీ నటులు మురళీమోహన్, రాజా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాస్వాన్ తెలుగులో విజయవాడ ప్రజలకు నమస్కారం తెలిపిన కేంద్ర మంత్రి కమలేష్ పాస్వాన్, దుర్గామాతకు జై అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తన మిత్రులు ఎంపీ కేశినేని చిన్ని, ఎంపీ లావు కృష్ణదేవరాయలు ఆహ్వానం మేరకు విజయవాడకు రావడం సంతోషంగా ఉందన్నారు. విజయవాడలో శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని, విజయవాడ ఉత్సవ్ 2.0ను అద్భుతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. విజయవాడ ఉత్సవ్తో పాటు సరస్ మేళాను కూడా విజయవంతం చేయాలని కోరారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనడం శుభపరిణామమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ ఆయా ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు అభివృద్ధి చెందాలని, వాటికి తగిన గుర్తింపు లభించాలని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు స్థానిక కళలు, సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజయవాడ ఉత్సవ్ నిర్వహణను అభినందించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నగరంలో ఇంతమందిని భాగస్వాములుగా చేసి ఇంతటి భారీ కార్యక్రమాన్ని నిర్వహించడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఎంపీ కేశినేని చిన్ని ఆశయం మేరకు మైసూరు, కోల్కతా నగరాల్లో నిర్వహించే స్థాయిని మించి విజయవాడలో దసరా ఉత్సవాలు జరగాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్సవాల్లో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ భాగస్వాములుగా చేయడం అభినందనీయమన్నారు. విజయవాడలో ఒకేసారి మూడు ప్రధాన ఉత్సవాలు నిర్వహించడం గొప్ప విషయమని, ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణలో కేంద్ర మంత్రి కమలేష్ పాస్వాన్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. జాతీయ సరస్ మేళాలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొంటున్నారని, వారి ఉత్పత్తులకు ప్రోత్సాహం లభించేలా ఈ వేదిక ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో పలువురు ముఖ్యమంత్రులు కూడా విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాల్లో పాల్గొననున్నారని, ఈ ఉత్సవ్ ద్వారా విజయవాడ నగరానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని పేర్కొన్నారు. రాబోయే మూడు, నాలుగు నెలల్లో సమృద్ధిగా వర్షాలు కురిసి, నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలగాలని ఆకాంక్షించారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జాతీయ సరస్ మేళాను విజయవాడకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాస్వాన్కు విజయవాడ ప్రజలందరి తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ఢిల్లీని దాటి తొలిసారిగా జాతీయ సరస్ మేళాను నేరుగా ఆంధ్రప్రదేశ్లోని విజయవాడలో నిర్వహించడం ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. ఈ మేళా రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలకు, స్వయం సహాయక సంఘాలకు స్ఫూర్తినివ్వడంతో పాటు, వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో, సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ సహకారంతో ఉత్సవ్ కార్యక్రమాలు అద్భుతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. విజయవాడ ఉత్సవ్కు హాజరుకానున్న ముఖ్యమంత్రులను ఆహ్వానించడంలో ఎంపీ లావు కృష్ణదేవరాయలు ప్రత్యేక చొరవ చూపుతున్నారని, నాయకులందరి సమష్టి కృషితోనే ఈ ఉత్సవాలు ఇంత ఘనంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవ్ అనేది కేవలం నిర్వాహకులు నిర్వహించే కార్యక్రమం మాత్రమే కాదని, విజయవాడ నగర ప్రజలందరూ భాగస్వాములై జరుపుకునే పండుగ అని ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విజయవాడ ఉత్సవ్కు హాజరుకానున్నారని తెలిపారు. గత ఏడాది విజయవాడ ఉత్సవ్ తొలి సంచికను యువనేత నారా లోకేష్ ప్రారంభించగా, ఈ ఏడాది విజయవాడ ఉత్సవ్ 2.0ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రారంభించారని గుర్తుచేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అందిస్తున్న సహకారం, నాయకుల సమష్టి కృషి విజయవాడ ఉత్సవ్ను మరింత ఘనంగా నిర్వహించేందుకు దోహదపడుతున్నాయని అన్నారు. విజయవాడ నగర సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పడం, దసరా ఉత్సవాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, స్థానిక కళాకారులకు ప్రోత్సాహం అందించడం, మహిళా స్వయం సహాయక సంఘాలకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం విజయవాడ ఉత్సవ్ ప్రధాన లక్ష్యాలని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.



# చందర్లపాడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. కూటమి జెండా ఎగరేద్దాం

**అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

చందర్లపాడు,అక్టోబర్ 14,మనం న్యూస్: చందర్లపాడు మండలంలోని ప్రతి గ్రామం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. చందర్లపాడు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆమె నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు.

**56 బూత్లలో 5,027 ఓట్ల ఆధిక్యం.. కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనం**

గత అసెంబ్లీ ఎన్నికల్లో చందర్లపాడు మండలంలోని 56 బూత్లలో 5,027 ఓట్ల ఆధిక్యాన్ని అందించడం ఒక్కరి విజయమే కాదని, ప్రతి గ్రామంలో ప్రతి గడపను పలకరిస్తూ, పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఫలితమని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గత రెండేళ్లలో తల్లికి వందనం, పెంచిన పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తల పాత్ర అభినందనీయమన్నారు. గ్రామాల్లో రోడ్లు, వ్యవసాయ విద్యుత్, వైద్య సదుపాయాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి ప్రజా సమస్యల పరిష్కారంలోనూ కార్యకర్తలు తనకు అండగా నిలుస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం మళ్లీ ప్రగతి బాటలో...

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిబద్ధత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆమె అన్నారు. తల్లికి వందనం, రూ.4,000 పింఛను, అన్నదాత సుఖీభవ, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజన సదుపాయం వంటి కార్యక్రమాలు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చేపట్టిన చర్యలని వివరించారు.

**వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు రూ.15 కోట్లు**

నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లోని 37 గ్రామాలకు, 17 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే లక్ష్యంతో ఉన్న వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం గత ఐదేళ్లలో నిర్వహణ లోపంతో నిర్లక్ష్యానికి గురైందని సౌమ్య తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పథకం పునరుద్ధరణ కోసం ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేయగా, రూ.15 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పునరుద్ధరణ పనులను ప్రారంభించారని, 2027 ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమని వెల్లడించారు.

**చందర్లపాడు మండల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు**

మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తంగిరాల సౌమ్య వివరించారు. - సీసీ రోడ్ల నిర్మాణం: పల్లె పండుగ 1, 2, 3 కార్యక్రమాల ద్వారా సుమారు రూ.11 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. - పంచాయతీరాజ్ రోడ్లు: చందర్లపాడు నుంచి తుర్లపాడు వరకు రహదారి అభివృద్ధికి రూ.3.85 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.- వెల్నెస్ హెల్త్ సెంటర్లు: గుడిమెట్ల, ముప్పాళ్ల గ్రామాల్లో ఒక్కో కేంద్రానికి రూ.36 లక్షల చొప్పున మొత్తం రూ.72 లక్షలతో ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టి వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.- గోకులం షెడ్లు: మండలంలో రూ.1.26 కోట్లతో 68 గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు వెల్లడించారు.- ఆర్ అండ్ బీ రహదారులు: మండల పరిధిలో సుమారు రూ.6 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. చింతలపాడు, చందర్లపాడు-పాటెంపాడు ప్రాంతాల్లో సీసీ, బీటీ రోడ్ల పనులు, నందిగామ-పొక్కునూరు రహదారిపై వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నట్లు వివరించారు.- ముప్పాళ్ల గ్రామానికి ప్రత్యేక నిధులు: ఉత్తమ గ్రామపంచాయతీగా గుర్తింపు పొందిన ముప్పాళ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.2 కోట్ల నిధులు సమకూర్చినట్లు, ఉత్తమ గ్రామపంచాయతీ కింద రూ.కోటి నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు.- ముఖ్యమంత్రి సహాయ నిధి: అర్హులైన బాధితులకు ఎల్ఓసీలు, రీయింబర్స్మెంట్ ఫైళ్ల ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.3 కోట్ల మేర ఆర్థిక సహాయం అందేలా కృషి చేసినట్లు పేర్కొన్నారు.- బొబ్బిల్లపాడు విద్యుత్ సమస్యకు పరిష్కారం: ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు రూ.22 లక్షలతో 69 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్ఫార్మర్లతో నూతన విద్యుత్ లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే తన ప్రధాన లక్ష్యమని సౌమ్య స్పష్టం చేశారు.



**స్థానిక ఎన్నికల్లో ఐక్యతే మన బలం**

సమావేశంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై తంగిరాల సౌమ్య కీలక సూచనలు చేశారు. మండలంలో 18 గ్రామపంచాయతీలు, 17 ఎంపీటీసీ స్థానాలు, ఒక జడ్పీటీసీ స్థానం ఉన్నాయని, పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఎంతోమంది సమర్థులైన నాయకులు ముందుకు వస్తున్నారని అన్నారు. అయితే ప్రతి స్థానానికి ఒక్కరికే అవకాశం కల్పించగలమని, అవకాశం రాని నాయకులు నిరుత్సాహపడకుండా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

**కూటమి ధర్మాన్ని పాటించాలి.. మిత్రపక్షాల అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి**

తెలుగుదేశం పార్టీ జనసేన, బీజేపీ మిత్రపక్షాలతో కలిసి ఎన్నికల్లో ముందుకు సాగుతోందని, కూటమి ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆమె పిలుపునిచ్చారు. కొన్ని స్థానాలను మిత్రపక్షాలకు కేటాయించాల్సి వస్తే, వారి అభ్యర్థులను కూడా తమ సొంత అభ్యర్థులుగా భావించి గెలిపించుకోవాలని సూచించారు. పరస్పర సహకారం, ఐక్యతతోనే కూటమి మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.టికెట్ లభించకపోయినా ప్రజాసేవకు అనేక అవకాశాలు ఉన్నాయని, మార్కెట్ కమిటీలు, దేవాలయ పాలక మండళ్లు, సహకార సంఘాలు, నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి బాధ్యతల్లో కష్టపడే నాయకులకు తగిన గుర్తింపు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**ప్రతి గ్రామంలో కూటమి జెండా ఎగరాలి**

రెండేళ్ల క్రితం చందర్లపాడు మండల ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యతని తంగిరాల సౌమ్య అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, రాబోయే ఎన్నికల్లోనూ ప్రతి గ్రామంలో కూటమి విజయానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభించేలా కృషి చేస్తానని పేర్కొంటూ, అభివృద్ధి ప్రయాణం ఆగకుండా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు, పోలింగ్ బూత్ కన్వీనర్లు, చందర్లపాడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, వివిధ గ్రామాల పార్టీ ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ కూసింది! నందిగామలో అమలులోకి ఎన్నికల నియమావళి: మునిసిపల్ కమిషనర్ లోవరాజు.

నందిగామ,అక్టోబర్ 14,మనం న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో నందిగామలో ఎన్నికల వేడి మొదలైంది. షెడ్యూల్ విడుదలైన తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎన్నికల కోడ్) అమలులోకి వచ్చిందని నందిగామ పురపాలక సంఘ కమిషనర్ జి.లోవరాజు అధికారికంగా ప్రకటించారు. పట్టణ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ రాతలను ఆయా పార్టీల నాయకులు స్వచ్ఛందంగా, తక్షణమే తొలగించుకోవాలని కమిషనర్ ఆదేశించారు. లేనిపక్షంలో మునిసిపల్ సిబ్బంది ద్వారా వాటిని తొలగించి, సంబంధిత ఖర్చులను సదరు అభ్యర్థులు లేదా పార్టీల నుండి వసూలు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మరియు ప్రజలు ఏం చేయవచ్చో, ఏం చేయకూడదో ఈ క్రింది విధంగా సమగ్రంగా వివరించడమైనది:



**ఎన్నికల కోడ్: ఏం చేయొచ్చు? ( చేయవలసినవి)**

ప్రచార సమయం: సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి పొంది, నిర్దేశిత సమయంలో మాత్రమే సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకోవాలి.శాంతియుత ప్రచారం: శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఇతర పార్టీల కార్యక్రమాలకు ఆటంకం కలిగించకుండా ప్రచారం చేసుకోవాలి.వ్యక్తిగత స్థలాలు: ప్రైవేట్ వ్యక్తుల స్థలాలు లేదా ఇళ్లపై ప్రచార సామగ్రి ఏర్పాటు చేయాలంటే సదరు యజమానుల రాతపూర్వక అనుమతి ఖచ్చితంగా తీసుకోవాలి.ఖర్చుల నమోదు: ప్రచారానికి పెట్టే ప్రతి రూపాయి ఖర్చును అభ్యర్థులు తమ రిజిస్టర్లలో ఖచ్చితంగా నమోదు చేయాలి. నిబంధనల అమలు: ప్రభుత్వ అధికారులు, పోలీసుల తనిఖీలకు పూర్తిగా సహకరించాలి.ఓటర్ల చైతన్యం: ఓటు హక్కు ప్రాధాన్యతపై ఓటర్లలో అవగాహన కల్పించవచ్చు.

**ఎన్నికల కోడ్: ఏం చేయకూడదు? (చేయకూడనివి)**

ఫ్లెక్సీలు, వాల్ రాతలు: ప్రభుత్వ భవనాలు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి రాజకీయ ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు, వాల్ రాతలు ఉండరాదు.ప్రలోభాలు: ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు పంచడం లేదా ఉచితంగా వస్తువుల పంపిణీ చేయడం తీవ్ర నేరం.మత/కుల ప్రచారాలు: కులాల, మతాల మధ్య విద్వేషాలు రేకెత్తించేలా లేదా వ్యక్తిగత దూషణలతో ప్రసంగాలు చేయకూడదు. ప్రార్థనా మందిరాలను (గుడులు, మసీదులు, చర్చీలు) ప్రచార వేదికలుగా వాడరాదు.ప్రభుత్వ వనరులు: అధికార పక్షం వారు ప్రభుత్వ వాహనాలు, నిధులు, భవనాలను లేదా ప్రభుత్వ పథకాల ప్రచారాలను ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు. కొత్త పథకాలు/పనులు: ఓటర్లను ఆకట్టుకునేలా కొత్త ప్రభుత్వ పథకాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు లేదా కొత్త నిధుల మంజూరు చేయకూడదు. అనుమతి లేని మైకులు: రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మైకులు, లౌడ్స్పీకర్లు వాడకూడదు. పగటిపూట కూడా ముందస్తు అనుమతి తప్పనిసరి.నగదు రవాణా: సరైన ఆధారాలు, పత్రాలు లేకుండా రూ. 50,000 కంటే ఎక్కువ నగదును రవాణా చేయకూడదు. నందిగామ పురపాలక సంఘ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, మరియు ప్రజలు మునిసిపల్ అధికారులకు, పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కమిషనర్ జి.లోవరాజు విజ్ఞప్తి చేశారు.

### నెహ్రూ నగర్‌లో ఘనంగా
# దసరా బతుకమ్మ ఉత్సవాలు



**నందిగామ, అక్టోబర్ 14, మనం న్యూస్:** నందిగామ పట్టణంలోని నెహ్రూ నగర్ లో బాల భక్త గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెలుగుల పందిట్లో దసరా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కమిటీ సభ్యులు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో, రంగు రంగుల పూలతో బతుకమ్మ పందిరిని అందంగా అలంకరించారు. ప్రతి రోజు సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడుతున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను నందిగామలో కూడా ఎంతో ఘనంగా జరుపుకోవడం విశేషం. చిన్నారుల నుండి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగు తాయని, చివరి రోజు సద్దుల బతుకమ్మ రోజున భారీ బతుకమ్మ ఊరేగింపు, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల భక్త గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, నెహ్రూ నగర్ మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మ వారికి మహా చండీ దేవి అలంకారం



**నందిగామ,అక్టోబర్ 14,మనం న్యూస్:** నందిగామ మండలం, గోళ్ళమూడి గ్రామంలో గల శివాలయంలో ఈరోజు దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మ వారికి మహా చండీ దేవి అలంకారం చేసి అమ్మ వారికి కుంకుమ పూజా కార్యక్రమాలు అర్చకులు రామ్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించినారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చినారు. ఈ కార్యక్రమం లో కమిటీ చైర్మన్ చావా అర్జునరావు మరియు భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ మహా చండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి



**నందిగామ, అక్టోబర్ 14,మనం న్యూస్:** నందిగామ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఆరో రోజు ప్రత్యేకత - మహా చండీ అలంకారం. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 6వ రోజు అమ్మవారు శ్రీ మహా చండీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చండీ అంటే చండ ముండులను సంహరించిన తేజోమయి. దుర్గా సప్తశతి ప్రకారం చండీ దేవి సకల దేవతల శక్తుల సమాహారం. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే శత్రు భయం తొలగి, సకల కార్యాలు విజయవంతమవుతాయని పురాణాలు చెబుతున్నాయి.

**విశ్లేషణ:**

వాసవి అమ్మవారు సాధారణంగా శాంతి స్వరూపిణి, అహింసా మూర్తి. కానీ నవరాత్రులలో చండీ రూపం ధరించడం వెనుక ఉన్న ఆంతర్యం - ధర్మ పరిరక్షణ కోసం అవసరమైతే శాంతి మూర్తి కూడా శక్తి స్వరూపిణిగా మారుతుందని తెలియజేయడమే. వైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవి మాత చండీ రూపంలో భక్తులకు అభయాన్ని ప్రసాదిస్తోంది.

**పూజా కార్యక్రమాలు:**

ఉదయం 5 గంటల నుండే ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, 108 కలశాలతో అభిషేకం, చండీ సప్తశతీ హోమం, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు చండీ మూల మంత్రాన్ని పఠించారు. ఆలయాన్ని 10 క్వింటాళ్ల పూలతో, విద్యుత్ దీపాలతో అద్భుతంగా అలంకరించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో క్యూ లైన్ల ద్వారా దర్శన ఏర్పాట్లు చేశారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, చెక్క భజనలు, కోలాటం కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు పులిహోర, లడ్డూ ప్రసాదం, అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, వాసవి ఆలయ కమిటీ చైర్మన్ చవట నాగేశ్వరరావు, మహిళా మండలి సభ్యులు, వందలాది భక్తులు పాల్గొన్నారు.

# మహా చండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న మరిడీ మహాలక్ష్మి అమ్మవారు



**నందిగామ, అక్టోబర్ 14, మనం న్యూస్:** మరిడీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా అమ్మవారు మహా చండీ దేవి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించబడి భక్తులకు దర్శనమిచ్చారు. చండీ దేవి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు ప్రతీక అని, ఈ అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే భయాలు తొలగి, ధైర్యం, విజయం కలుగుతుందని అర్చకులు తెలిపారు. ఉదయం నుండి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, చండీ సప్తశతి పారాయణం, చండీ హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.సాయంత్రం మహిళా భక్తులచే లలితా సహస్రనామ పారాయణం, భజన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు,ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న శుకశ్యామలాంబ దేవి అమ్మవారు



**నందిగామ, అక్టోబర్ 14, మనం న్యూస్:** శ్రీ శుక శ్యామలాంబ దేవి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణ దేవిని దర్శించుకుంటే ఇంట్లో అన్నపానీయాలకు లోటు ఉండదని, సకల ఐశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, అన్నపూర్ణ అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మహిళా భక్తులచే భజనలు, కోలాటాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నందిగామ రామలింగేశ్వర స్వామి వారికి త్రిపుర నామాలు అందజేస్తున్న భక్తులు



**నందిగామ,అక్టోబర్ 14,మనం న్యూస్:**దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందిగామ పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారికి వెండి త్రిపుర నామాలను అందజేశారు. బుధవారం నందిగామ పట్టణానికి చెందిన కే.మణికంఠ అనే భక్తుడు సుమారు 25వేల రూపాయల విలువ కలిగిన 112 గ్రాముల వెండి త్రిపుర నామాలను ఎండోమెంట్ అధికారులకు అందజేశారు. ఆలయ అర్చక స్వాములు భక్తులు రామలింగేశ్వర స్వామి వారికి సమర్పించిన వెండి త్రిపుర నామాలను సంప్రోక్షణ, పూజలు చేసి స్వామివారికి అలంకరించారు.

# నందిగామ ఆర్డీవోకి వినతి పత్రం అందజేసిన జర్నలిస్ట్ సంఘ నాయకులు



**నందిగామ, అక్టోబర్ 14,మనం న్యూస్:** నందిగామ పట్టణంలో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఢిల్లీలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ నందిగామలో బుధవారం జర్నలిస్టులు నిరసన తెలియజేశారు. అనంతరం నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు ఆకుల వెంకటనారాయణ, మీరా హుస్సేన్, రవిశంకర్ తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కార్యక్రమాలను కవరేజ్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు జరిపిన దాడులు హేయమైన చర్యని పేర్కొన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై రాజకీయ పార్టీ నాయకులు అధికారులు కొంతమంది దుష్ట శక్తులు దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని, తక్షణమే జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జర్నలిస్టులతో చట్టబద్ధత కల్పించాలని జర్నలిస్టులపై దాడులకు నివారణకు హైపవర్ కమిటీ వేయాలని, జర్నలిస్టు సంక్షేమానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ జిల్లాలో అనేకమంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అర్హులైన జర్నలిస్టులు ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం ఉత్సవాలు కవరేజ్ కి జర్నలిస్టులు అందరికీ పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో జర్నలిస్టులు అందరికీ ఏసీ బస్సు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి జర్నలిస్టుకు రుణ సదుపాయం ఉచిత ఆరోగ్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు కార్మిక భీమా సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ న్యూస్ ఎడిటర్ ఎం.ఏ.ఖాజా , సత్యనారాయణ, ఖుద్దూస్, చంద్రశేఖర్, చందు, సైదాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల ప్రేమ.. ఆపై పెళ్లి.. తర్వాత నెలకే ఒకరి తర్వాత మరొకరి ఆత్మహత్య..





**నందిగామ, అక్టోబర్ 14,మనం న్యూస్:** ఐదేళ్లు ప్రేమించుకుని పెళ్లైన నెలరోజులకే విభేదాల కారణంగా భార్యభర్తలు వేర్వేరుగా ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన ఖమ్మం జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే ఎర్రుపాలెంకు చెందిన మహేష్ (25) విజయవాడలో ల్యాబ్ టెక్నీషియన్గా పనిచేస్తున్నాడు. అయితే అప్పుడే అతనికి ఆంధ్రప్రదేశ్లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం బెల్లంకొండవారి పాలెంకు చెందిన వెంకటరమణ (23) అనే యువతితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కొన్నాళ్లు ప్రేమగా మారడంతో ఒకరినొకరు ఇష్టపడి ప్రేమించుకున్నారు. వీరి ప్రేమ బంధం ఐదేళ్లపాటు ఎంతో ఆనందంగా కొనసాగింది. అనంతరం ఇరువైపులా పెద్దలను ఒప్పించి నెల రోజుల క్రితమే వివాహ బంధంతో ఒక్కటయ్యారు.

## మనస్పర్థలు.. విడాకుల పంచాయితీ....

ఐదేళ్ల ప్రేమలో రాని విభేదాలు పెళ్లయిన నెల రోజులకే వారి మధ్య మొదలయ్యాయి. దంపతుల మధ్య మనస్పర్థలు తీవ్రమవడంతో కలిసి ఉండలేక పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో వ్యవహారం విడాకుల వరకు వెళ్లింది. పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగి విడాకులు తీసుకోవడానికి అంతా సిద్ధమైంది. అయితే, ఈ పరిణామంతో భార్య వెంకటరమణ తీవ్ర మనోవేదనకు గురైంది.

## ఆసుపత్రిలో భార్య, రైలు కింద పడి భర్త ఆత్మహత్య..

తీవ్ర బాధలో ఉన్న వెంకటరమణ నందిగామ నుంచి పెనుగంచిప్రోలు మండలం నవాబుపేటలోని తన తాతగారింటికి వెళ్లింది. అక్కడ ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన విజయవాడ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మరోవైపు ఐదేళ్లు ప్రాణంగా ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య ఇక లేదన్న నిజాన్ని మహేష్ జీర్ణించుకోలేకపోయాడు. భార్య మరణంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతను.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక్కరోజు వ్యవధిలోనే ప్రేమించి పెళ్లి చేసుకున్న నవదంపతులు ప్రాణాలు కోల్పోవడంతో ఏపీలోని బెల్లంకొండవారిపాలెం, తెలంగాణలోని ఎర్రుపాలెం గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

# బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం



**నందిగామ, అక్టోబర్ 14,మనం న్యూస్:** నందిగామ నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మునగంటి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ల్లా కార్యదర్శి పోరుగండి నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. నందిగామ మున్సిపాలిటీలో 10 వార్డులు అడగాలని నిర్ణయం చేయడం జరిగింది. నందిగామ మున్సిపాలిటీకి భారతీయ జనతా పార్టీ సహకారంతో కూటమి ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలు కేటాయించిందని కాబట్టి భారతీయ జనతా పార్టీకి కూటమిలో సమన్యాయం చేయాలని కోరుతున్నామని పోటీదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కేదార్నాథ్ శర్మ, ఓబీసీ మోర్చ జిల్లా కార్యదర్శి తొర్లికొండ సీతారామయ్య, ఓబిసి జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల సత్యనారాయణ, మోడీ కార్యక్రమాల కన్వీనర్ ఉన్నం గిరిధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి తులసి కృష్ణ, ఓబిసి మోర్చా లక్ష్మణ్,కొత్త సాంబశివరావు, వేజండ్ల వంశీ, పీట్ల నాగేశ్వరరావు, నరసింహారావు మరియు బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# నందిగామ పిఏసీఎస్ చైర్మన్ చొరవతో హైవే రోడ్డు పై తెలుపు, రంగు చారల పనులు ప్రారంభం



**నందిగామ,అక్టోబర్ 14,మనం న్యూస్:** ప్రమాదాల నివారణకు నందిగామ పిఏసీఎస్ చైర్మన్ హరికృష్ణ చొరవ ఆర్‌బి అధికారుల స్పందనతో రోడ్డు మరమ్మతులు, తెలుపు రంగు చారల పనులు ప్రారంభించినారు. నందిగామ పరిధిలోని అనాసాగరం రంగా సెంటర్ వద్ద రోడ్డు భద్రతకు సంబంధించిన సమస్యలపై స్థానిక ప్రజలు నందిగామ పిఏసీఎస్ చైర్మన్ కొట్టె. హరికృష్ణ (బద్రి) దృష్టికి తీసుకెళ్లారు. గత కొన్ని రోజులుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు మార్గంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లకు సరైన గుర్తింపు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చైర్మన్కు వివరించారు.ప్రజల విజ్ఞప్తిపై స్పందించిన చైర్మన్ కొట్టె. హరికృష్ణ (బద్రి) సమస్యను సంబంధిత ఆర్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సెప్టెంబర్ 17వ తేదీన ఆర్డీవోని కలిసి సమస్య తీవ్రతను వివరించారు. ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. చైర్మన్ చేసిన విజ్ఞప్తికి స్పందించిన అధికారులు ప్రస్తుతం స్పీడ్ బ్రేకర్ల మరమ్మతులు చేపట్టి, తెలుపు రంగు చారలు వేస్తున్నారు. దీంతో రోడ్డు భద్రత మెరుగుపడి, వాహనదారులకు స్పీడ్ బ్రేకర్లు స్పష్టంగా కనిపించే అవకాశం ఏర్పడింది. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం దిశగా కృషి చేసిన కొట్టె. హరికృష్ణకు స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

# ఆలిండియా అడ్వేకెట్స్ క్రికెట్ టోర్నమెంట్స్ కు లగడపాటి సురేష్ ఎంపిక.



**నందిగామ,అక్టోబర్ 14,మనం న్యూస్:** నందిగామ మండలం, జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నమెంట్స్ కు ఆంధ్రప్రదేశ్ స్టేట్ తరుపున లగడపాటి సురేష్ ను ఎంపిక చేసినట్లు ఇండియన్ అడ్వకేట్స్ స్పోర్టట్స్ అసోసియేషన్ ఎక్జిక్యూటివ్ కమిటి సభ్యులు నరాల రమణ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ లోని కాన్పూర్ నగరంలో నిర్వహించనున్న 8వ ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ లో ఎపి జట్టులో నందిగామ మండలం, జొన్నలగడ్డ గ్రామానికి చెందిన న్యాయవాది, ఏపి హైకోర్ట్ అడ్వకేట్స్ అసోసియేషన్ మెంబర్ అగడపాలి సురేష్ ఎంపిక అయ్యారని వివరించారు. దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల జట్లు పాల్గొననున్న ఈ - టోర్నమెంట్ అక్టోబర్ 14 నుంచి 21 వరకు జరుగుతున్నట్లు తెలిపారు, ఈ సందర్భంగా లగడపాటి సురీషకు పలువురు న్యాయమూర్తులు, న్యాయ వాదులు అభినందనలు తెలియజేసారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బతుకమ్మ సందడి

**వేడుకల్లో చిన్నారులు యువతీ యువకులు ముత్తైదువులు**

**నందిగామ,అక్టోబర్ 14,మనం న్యూస్:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల పురస్కరించుకొని నందిగామ మండలంలోని పలు గ్రామాలలోని దేవాలయాల్లో బతుకమ్మల ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొన్నది. బుధవారం నందిగామ మండలం గొల్లమూడి చందాపురం మాగల్లు, మునగచర్ల, అంబారుపేట, నందిగామ పట్టణంలోని పలు దేవాలయాల్లో తంగేడు, గానుగ మందార పూలు, చామంతి పూలు రకాల పూలతో గౌరీ దేవితో కూడిన బతుకమ్మలను తయారు తయారు చేశారు. ఆయా దేవాలయాల్లో ముత్తయిదులు, యువతులు, చిన్నారులు తులసి మాత,గౌరీ దేవతామూర్తులకు పూజలు చేసి బతకమ్మ పాటల పాడుతూ కోలాటాలు ఆడుతూ సందడి చేశారు.



# అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అంబారుపేట సత్తెమ్మ తల్లి అమ్మవారు.



**నందిగామ,అక్టోబర్ 14,మనం న్యూస్:** నందిగామ మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు బుధవారం జగన్మాత అన్నపూర్ణాదేవిగా, మహా చండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. మండలంలోని అంబారుపేట గ్రామంలో సత్తెమ్మ తల్లి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది, ఆలయ ఈవో పీవీకే సీతారావమ్మ, బాలయ్య కమిటీ చైర్మన్ మంచాల మాధవరావు ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాముల నందిగామ సుబ్బారావు శర్మ, బాల కోటేశ్వర శర్మ, రఘునాధ శర్మ అవధాని ఆధ్వర్యంలో సత్యమ్మ తల్లి అమ్మవారికి ఖడ్గమాల శ్రీ చక్రవర్ణార్చన, విశేష కుంకుమార్చనలు, చండీ సహిత హోమాది క్రతువులు వేదోక్తంగా నిర్వహించారు. లింగాలపాడు లక్ష్మీ పేరంటాల అమ్మవారు, కూడలి శ్రీ రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు,సంగమేశ్వర స్వామి దేవాలయంలో పార్వతీ అమ్మవారు, గొల్లమడి శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు, వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు, పల్లగిరి గట్టుపై కనకదుర్గ కనకమహాలక్ష్మి జ్ఞానసరస్వతి అమ్మవార్ల త్రిశక్తిపీఠంలో జగన్మాత మహా చండీ దేవిగా ప్రత్యేక అలంకారంలో సామూహిక కుంకుమార్చనలు మూలమంత్ర హోమాది క్రతువులు వేదమంత్రోచారణ నడుమవిశేష అర్చనాది పూజలు జరిగాయి ఆయా దేవాలయాల్లో భక్తులు భారతిరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అంబర్పేట సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలోని వేదికపై కూచిపూడి సంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.. కళాకారులను ఆలయ కమిటీ చైర్మన్ మంచాల మాధవరావు జ్ఞాపికలు శాలవాలతో సత్కరించారు.